క్లుప్తంగా

నాగమానసాదేవి సన్నిధిలో ప్రత్యేక పూజలు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): లెనిన్ సెంటర్‌లోని ఓం షిర్డీ సాయిబాబా నాగమానసాదేవి ఆలయంలో కార్తిక మాసం ముగింపు సందర్భంగా ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద మహా శివలింగానికి అభిషేకాలు చేశారు. పెద్ద సంఖ్యలో అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులు, చీరలు సమర్పించారు. మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాస్వామి ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ జరిగింది.
–చల్లపల్లి బంగళా సమీపంలోని కాశీవిశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు భారీ అన్న సమారాధన జరిగింది.

వక్తృత్వ పోటీలతో నైపుణ్యం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు వక్తృత్వ పోటీల్లో పాల్గొని నైపుణ్యం పెంచుకోవాలని వాకర్స్ అసోసియేషన్ గవర్నర్ చిన్నం రామకృష్ణ అన్నారు. ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో విద్యార్థి వికాస వాహిని ఆధ్వర్యాన నవంబర్ నెలలో 'మా గ్రంథాలయం' అనే అంశంపై వీడియో వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు ఆదివారం బహుమతి ప్రదానం జరిగింది. చిన్నం రామకృష్ణ మాట్లాడుతూ వక్తలుగా ఎదగడానికి వక్తృత్వ పోటీలు దోహదపడతాయన్నారు. విద్యార్థి వికాస వాహిని సంస్థ అధ్యక్షుడు వి.కేశవరావు మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలను వినియోగించుకుని విజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. పోటీల్లో రెండో తరగతికి చెందిన తనూష ప్రథమ నిలిచింది. గ్రంథాలయ అధికారి కె. రమాదేవి మాట్లాడుతూ పోటీల్లో పాల్గొన్న ఇతర ప్రాంతాల విద్యార్థులకు నగదు బహుమతి, ప్రశంసా పత్రాలను పోస్టు ద్వారా పంపినట్లు తెలిపారు. విజయవాడ ఆర్ట్స్ సొసైటీ కార్యదర్శి పావులూరి చిదంబేశ్వరరావు, విజయవాడ లయన్స్ క్లబ్ జోనల్ సెక్రటరీ మహమ్మద్ ఇస్మాయిల్, సిబ్బంది రాంబాబు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రవికుమార్ కవిత్వం సామాజిక అంశాల సమాహారం



విజయవాడ కల్చరల్: కోసూరి రవికుమార్ కవిత్వం సామాజిక అంశాల సమాహారమని భాషావేత్త డాక్టర్ పాపినేని శివ శంకర్ అన్నారు. సాహితీ మిత్రులు ఆధ్వర్యాన విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యాలయంలో ఆదివారం కోసూరి రవికుమార్ రచించిన దాపల కవితా సంపుటి ఆవిష్కరణ సభను నిర్వహించారు. పుస్తకాన్ని ఆవిష్కరించిన శివ శంకర్ మాట్లాడుతూ రవికుమార్ నిరంతర అధ్యయన శీలి అన్నారు. ఆయన కవిత్వమంతా సమాజం చుట్టూ తిరిగిందన్నారు. అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రవికుమార్ కాలక్షేపంగా కవితా వ్యవసాయం చేయలేదని అక్షరాల కూర్పుతో పండించినట్లు తెలిపారు. కవి శ్రీరాం కవితా సంపుటి విశేషాలను వివరించారు. సాహితీవేత్తలు బండ్ల మాధవరావు, సుధారాణి రవికుమార్ సాహిత్య జీవిత విశేషలను వివరించారు. రవికుమార్ మాట్లాడుతూ సుదీర్ఘ విరామం తర్వాత కొత్త కవితా సంపుటి తీసుకువచ్చామన్నారు. అనిల్ డ్యానీ కార్యక్రమాన్ని నిర్వహించారు.

దీపారాధన.. యోగ సాధనకు గుర్తు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కార్తిక మాసంలో చేసే దీపారాధన యోగ సాధనకు గుర్తు అని త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక విజయవాడ కమిటీ అధ్యక్షుడు జగిరపు సురేష్ అన్నారు. కార్తిక మాసం చివరి రోజు ఆదివారం ఉడా కాలనీలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యాన భగవద్గీత ప్రచార కార్యక్రమ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తిక మాసంలో దీపాలు వెలిగించడంలోని జ్ఞానాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ప్రమిదలు, వత్తులు, వెలుగుకు అర్థం వివరించారు. అనంతరం భగవద్గీత ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో త్రైతసిద్ధాంతం –ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక విజయవాడ కమిటీ సభ్యులు చెంచు అప్పలనరసమ్మ, పైడప్పడు, సూరప్పడు తదితరులు పాల్గొన్నారు.

సంగీతానికి ఎల్లలు లేవు

విజయవాడ కల్చరల్: శ్రీసద్గురు సంగీత సభ ఆధ్వర్యాన దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో ఎనిమిది రోజులుగా నిర్వహిస్తున్న 31వ వార్షిక సంగీత మహోత్సవాలు ఆదివారం ముగిశాయి. సంగీతానికి ఎల్లలు లేవని చాటుతూ విఖ్యాత హిందూస్తానీ విద్వాంసుడు సంతోష్‌కుమార్ వయోలిన్‌పై వాగ్గేయకారుల కీర్తనలను పలికించారు. తబలాపై రాజ్‌కుమార్ నహర్ సహకరించారు. సంస్థ సంగీత విద్వాంసులు ఆలపించిన మంగళం కీర్తనలతో సంగీతోత్సవాలు ముగిశాయి.

నత్తనడకన పనులు

జీవీఆర్ నగర్‌లో వాటర్ ట్యాంక్ నిర్మాణం

- 3.30 కోట్ల వ్యయ అంచనా
- గత ప్రభుత్వంలోనే పైప్‌లైన్ల ఏర్పాటు
- కృష్ణాజలాలు వచ్చేదెన్నటికో..





వాటర్ ట్యాంక్ వద్ద తుప్పపట్టిన ఐరన్



జీవీఆర్‌నగర్‌లో నిర్మాణంలో ఉన్న వాటర్ ట్యాంక్

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 30వ డివిజన్ జీవీఆర్‌నగర్‌లో వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈప్రాంతానికి బుడమేరు అత్యంత సమీపంలో ఉండటంతో భూగర్భ జలాలు కలుషితమవుతాయనే ఉద్దేశంతో వేగంగా అభివృద్ధి చెందుతున్న జీవీఆర్‌నగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయకనగర్ తదితర ప్రాంతాలకు కృష్ణా జలాలు అందించడానికి గత ప్రభుత్వ హయాంలో 6.59 కోట్లు నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించారు. డివిజన్‌లో ప్రతి ఇంటికీ కృష్ణా జలాలు అందించాలనే లక్ష్యంతో ప్రతి వీధిలో పైపులైన్ పనులు పూర్తి చేశారు. వాటి కోసం తవ్విన గోతులు పూడ్చివేసి రోడ్లు సైతం వేశారు. గంగిరెడ్డుల దిబ్బ నుంచి రూ. 3.29 కోట్ల వ్యయం అంచనాతో 40 ఎంఎం మంచినీటి సరఫరా పంపింగ్ మెయిన్‌లైన్ ఏర్పాటు పనులు గత ప్రభుత్వ హయాంలోనే పూర్తిచేశారు.

ట్యాంక్ నిర్మాణానికి ప్రైవేట్ స్థలం సేకరణ

వేగంగా అభివృద్ధి చెందుతున్న ఇక్కడ వాటర్ ట్యాంక్ నిర్మాణానికి అవసరమైన స్థలం లేదు. దీంతో నాటి ఎమ్మెల్యే మల్లాది విష్ణు రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు, అధికారులతో మాట్లాడి బాండ్లు జారీ చేసి ట్యాంక్ నిర్మాణానికి జీవీఆర్‌నగర్‌లో ప్రైవేటు స్థలం సేకరించారు. వెంటనే వాటర్ ట్యాంక్ నిర్మించి కృష్ణా జలాలు అందించాలని అధికారులను ఆదేశించారు.
పనులు చురుగ్గా జరుగుతున్న సమయంలో ఎన్నికలు రావటం.. తర్వాత ప్రభుత్వ మారిపోయింది. దీంతో ఇక్కడ వాటర్ ట్యాంక్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. వాటర్ ట్యాంక్ నిర్మాణం కోసం తెచ్చిన ఐరన్ కూడా తుప్పుపట్టింది.సుమారు 90శాతం వరకు పనులు పూర్తయినా మిగిలిన పనులు ఎప్పుడు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకువస్తారో అని స్థానికులు అనుకుంటున్నారు.

వేగవంతం చేయాలి



వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంతంలో కృష్ణా జలాలు అందుబాటులోకి రాకపోవడం ఒక లోటుగా ఉంది. గత ప్రభుత్వ హయాంలోనే కృష్ణాజలాలు సరఫరా చేస్తారని భావించాం. కానీ పనులు పూర్తికాలేదు. అధికారులు వాటర్‌ట్యాంక్ పనులు వేగవంతం చేయాలి.
–షేక్ నాగూర్ వలీ, జీవీఆర్‌నగర్

బోర్ వాటరే ఆధారం



ఇక్కడ కృష్ణా జలాలు అందుబాటులోకి రాకపోవడంతో కేవలం బోర్ వాటర్‌పైనే ఆధారపడాల్సి వస్తోంది. బుడమేరు అత్యంత సమీపంలో ఉండటంతో భూగర్భ జలాలు కలుషితమయ్యే ప్రమాదం ఉంది. అధికారులు ప్రజలకు సాధ్యమైనంత త్వరగా కృష్ణాజలాలు సరఫరా చేయాలి.
–జి.వెంకటేశ్వరరావు, దేవీనగర్

నీటి కష్టాలు తీర్చాలి



వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు పూర్తికాకపోవటంతో బోర్ వాటర్‌తోనే పనులు పూర్తి చేసుకుంటున్నాం. వాటర్ పైపులైన్ పనులు పూర్తిచేసి చాలాకాలమైంది. ఇంత వరకు కృష్ణాజలాలు సరఫరా ప్రారంభం కాలేదు. అధికారులు చొరవ తీసుకుని కనీసం వచ్చే వేసవి నాటికి కృష్ణా జలాలు సరఫరా చేసి నీటి కష్టాలు తీర్చాలి.
–బి.శివశంకర్‌రాజు, దావు బుచ్చయ్యకాలనీ

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): పాయకాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో కొత్త 33 కేవీ ఫీడర్ పనులు, మరమ్మతుల నేపథ్యంలో సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పాయకాపురం, ఉడాకాలనీ సబ్‌స్టేషన్ల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ పి.రవీంద్రబాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పాయకాపురం, ఉడాకాలనీ సబ్‌స్టేషన్ల పరిధిలోని కండ్రిక, జర్నలిస్ట్ కాలనీ, ఎన్‌జీఓ కాలనీ, రాజీవ్ నగర్, ఎంఐజీ కాలనీ, ఎల్ఐజీ కాలనీ, ఈడబ్ల్యూఎస్ కాలనీ, విశాలాంధ్ర కాలనీ, డాక్టర్స్ కాలనీ, రాధానగర్, ప్రజాశక్తినగర్, బర్మా కాలనీ, పాయకపురం, పాకిస్తాన్ కాలనీ, ఏపీఎస్ రోడ్డు, ప్రకాష్ నగర్, సుందరయ్య నగర్, ఎల్‌బీఎస్ నగర్, పటేల్ నగర్, లక్ష్మీ నగర్, ప్రశాంతి నగర్, శాంతి నగర్, దేవినేని గాంధీపురం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి.. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

పటమట(విజయవాడతూర్పు): ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని వెంటనే పరిష్కరించడానికి నగర పాలక సంస్థ ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను నగరంలోని వీఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రధాన కార్యాలయంతోపాటు నగరంలోని మూడు సర్కిళ్లలోని జోనల్ ఆఫీసుల్లో కూడా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.
నగరపాలకసంస్థ సమస్యలపై ప్రజలు సమీపంలోని కార్యాలయంలో సంప్రదించవచ్చని, కార్యక్రమం సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అధికారులకు ఫిర్యాదులను అందించవచ్చని వివరించారు.

కూటమిది అసమర్థ పాలన

- డీఆర్సీ సమావేశంలో ఎమ్మెల్యేల కామెంట్లే నిదర్శనం
- వైఎస్సార్ సీపీ సెంట్రల్ సమన్వయకర్త మల్లాది విష్ణు



మధురానగర్(విజయవాడసెంట్రల్): కూటమి ప్రభుత్వ అసమర్థ పాలనకు కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల సమీక్ష సమావేశంలో టీడీపీ ఎమ్మెల్యేలు లేవనెత్తిన సమస్యలే నిదర్శనమని వైఎస్సార్ సీపీ సెంట్రల్ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల నుంచి వ్యతిరేకత పెరుగుతుండటంతో.. 6 నెలల కాలంలోనే చివరికి ఎమ్మెల్యేలు సైతం ప్రశ్నించే పరిస్థితి నెలకొందన్నారు. నగరాన్ని వరదలు ముంచెత్తి 3 నెలలు గడిచినా బాధితులకు పూర్తిగా న్యాయం జరగలేదని ఆరోపించారు. దీనిపై వైఎస్సార్ సీపీ మొదటి నుంచి చెబుతూనే ఉందని, రాజకీయ విమర్శలుగా కొట్టి పారేశారని మండిపడ్డారు.
వీఎంసీ కౌన్సిల్ సమావేశంలోనూ టీడీపీ కార్పొరేటర్లు అడ్డగోలుగా వాదించారని.. కానీ ఇప్పుడు డీఆర్సీ సమావేశంలో సాక్షాత్తు టీడీపీ ప్రజాప్రతినిధులే ఒప్పుకున్న పరిస్థితి నెలకొందన్నారు. బుడమేరు వరద బాధితులకు నేటికీ పరిహారం అందలేదని ఎంపీ కేశినేని చిన్ని మాట్లాడితే.. తాగునీటి సమస్యపై ఓ ఎమ్మెల్యే, రైతులకు ప్రత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని మరో ఎమ్మెల్యే ప్రశ్నించడం ఈ ప్రభుత్వ చేతకానితనానికి అద్దం పడుతోందన్నారు. కూటమి సర్కార్‌కు ప్రజలపై 1 శాతం జీఎస్టీ భారం వేయడంపై ఉన్న శ్రద్ధ. ప్రజా సమస్యల పరిష్కారంలో లేదని దుయ్యబట్టారు. మరోవైపు రైతు బజార్లన్నీ అవినీతి కంపు కొడుతున్నాయని.. సిండికేట్లు తనకే డబ్బు ఇవ్వడానికి వస్తున్నారని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ చెప్పడం ఈ ప్రభుత్వంలో జరుగుతున్న అవినీతిని అంగీకరించడమేనని అభిప్రాయపడ్డారు. ఓవైపు సొంత పార్టీ ఎమ్మెల్యేలే అసంతృప్తి గళం వినిపిస్తుంటే.. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్ అన్నీ అసత్యాలే మాట్లాడుతున్నారని మల్లాది విష్ణు మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రజా సమస్యలపై సీరియస్‌గా వ్యవహరించాలని.. వరద బాధితులకు, రైతులకు తక్షణ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఐఎంఏ నూతన కార్యవర్గం బాధ్యతల స్వీకరణ



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) విజయవాడ బ్రాంచి 2024–25 సంవత్సరానికి నూతన కార్యవర్గ సభ్యులు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గవర్నర్‌పేటలోని ఐఎంఏ హాలులో జరిగిన కార్యక్రమంలో నూతన అధ్యక్షుడిగా డాక్టర్ బోడేపూడి హనుమయ్య, కార్యదర్శిగా డాక్టర్ సురేష్‌కుమార్, కోశాధికారిగా డాక్టర్ ఎంవీ సుబ్బారావు బాధ్యతలు స్వీకరించారు. వీరితో పాటు ఉపాధ్యక్షులుగా డాక్టర్ వీఎస్ వరప్రసాద్, డాక్టర్ వి.పద్మజ, సంయుక్త కార్యదర్శులుగా డాక్టర్ పి.సుశీల, డాక్టర్ ఉప్పులేటి తారకప్రసాద్, స్టేట్ కౌన్సిల్ సభ్యులుగా డాక్టర్ పరుచూరి అనీల్‌కుమార్, డాక్టర్ పి.జయకర్‌బాబు, అకడమిక్ సభ్యుడిగా డాక్టర్ మెహబూబ్ షేక్, సభ్యులుగా డాక్టర్ పీవీ సోనీలాల్, డాక్టర్ కదీర్‌షరీఫ్ మరో 30 మంది ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా బాధ్యతలు స్వీకరించారు. వీరిని పూర్వ అధ్యక్షుడు చలసాని ప్రమోద్ తదితరులు అభినందించారు.

శివారాధన ముక్తికి మార్గం

విజయవాడ కల్చరల్: శివారాధన ముక్తికి మార్గమని శాతవాహనకళాశాల కరస్పాండెంట్ నిడుమోలు రమాసత్యనారాయణ అన్నారు. రామకోటి క్షేత్రంలో నెల రోజులుగా నిర్వహిస్తున్న కార్తిక మాస ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. శారద కళాశాల కరస్పాండెంట్ కుందా రామనారాయణ పాల్గొన్నారు.

వసతుల కల్పనలో నిర్లక్ష్యం వద్దు

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



పాయకాపురం చెరువు వివరాలు తెలుసుకుంటున్న కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): నగర ప్రజలకు సౌకర్యాల కల్పనలో అధికారులు నిర్లక్ష్యగా వ్యవహరించొద్దని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన ఆదివారం సాంబమూర్తి రోడ్డు, భగత్‌సింగ్ రోడ్డు, జీఎస్ రాజు రోడ్డు, పాతపాడు, నూజివీడు రోడ్డు, సింగ్‌నగర్ కండ్రిక ప్రాంతాల్లో పర్యటించారు. ఆయన 64వ డివిజన్ ప్రజలకు సదుపాయాలను కల్పించాలని, స్వచ్ఛమైన తాగునీటి సరఫరా చేయాలని, రోజూ తాగునీటి నమూనాలు పరీక్షిస్తున్నా పూర్తి నిర్ధారణ కచ్చితంగా చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. తాగునీటి పైపులైనులు డ్రైన్‌లో కలవకుండా నిరంతరం పర్యవేక్షణ ఉండాలని చెప్పారు. అభివృద్ధి ప్రణాళికలను తయారు చేసి సమర్పించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఖాళీ స్థలాలను పార్కులుగా అభివృద్ధి చేయాలని, పాయకాపురం చెరువును అభివృద్ధి చేయడానికి తీసుకున్న చర్యలను తనకు అందించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్వీ ప్రసాద్, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, సూపరింటెండెంట్ ఇంజినీర్ (వర్క్స్) పి.సత్యనారాయణ, ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

సేవలకు పురస్కారం



డాక్టర్ బ్రహ్మదేశం సోషల్‌సర్వీస్ సొసైటీకి పురస్కారం అందజేస్తున్న డాక్టర్ సిరి

మధురానగర్(విజయవాడసెంట్రల్): హెచ్ఐవీ ఎయిడ్స్ నివారణ, హెచ్ఐవీ సోకినవారికి అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఆదివారం దుర్గాపురానికి చెందిన డాక్టర్ బ్రహ్మదేశం సోషల్‌సర్వీస్ సొసైటీ, హెల్పింగ్ టుగెదర్ 2009 గ్రూప్ చారిటబుల్ ట్రస్ట్‌కు రాష్ట్ర స్థాయి సేవా పురస్కారాన్ని ఏపీ శాక్స్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ సిరి అందజేశారు. ప్రపంచ ఎయిడ్స్‌దినం పురస్కరించుకుని ఆదివారం నగరంలో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు బ్రహ్మదేశం వసంతకుమార్, కార్యదర్శి కొండాయగుంట రాము, కోశాధికారి గుర్రం ఏడు కొండలకు పురస్కారంతో సత్కరించారు. హెల్పింగ్ టుగెదర్ 2009 గ్రూప్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు కోరంగి నామల్లిక, ఎస్‌కే షఫీ, రహీమాలకు సేవా పురస్కారం అందజేశారు. నిరుపేద, హెచ్ఐవీ బాధిత చిన్నారులకు ట్రస్ట్ ఆధ్వర్యాన నిత్యావసర సరుకులు అందజేశారు.
రెడ్ రిబ్బన్ క్లబ్, ఎన్ఎస్ఎస్ యూనిట్ ద్వారా విద్యార్థులు, ప్రజల్లో హెచ్ఐవీపై అవగాహనకల్పిస్తున్నందుకుగానూ ఎస్ఆర్ఆర్ అండ్‌సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఏపీశాక్స్ పీడీ డాక్టర్ ఏ సిరి చేతులమీదుగా ప్రిన్సిపాల్ డాక్టర్ కె భాగ్యలక్ష్మి, డాక్టర్ యుగంధర్‌లు ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు.
ప్రపంచ ఎయిడ్స్ దినం పురస్కరించుకుని ఆదివారం లెప్రాసొసైటీ ఆధ్వర్యాన ఇన్నర్‌వీల్‌క్లబ్ విజయవాడ ఈస్ట్ సహకారంతో హెచ్ఐవీ బాధితులకు బియ్యం పౌష్టికాహారం, దుప్పట్లు అందజేశారు. క్లబ్ అధ్యక్షులు డాక్టర్ రేవతి, సెక్రటరీ డాక్టర్ అరుణ లెప్రా సొసైటీ స్టేట్ కో ఆర్డినేటర్ రాధిక తదితరులు పాల్గొన్నారు.

గాన చరితుడు ఘంటసాల



ఘంటసాల గాన చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ ఆదినారాయణ పక్కన అతిథులు

విజయవాడ కల్చరల్: గాన చరితుడు ఘంటసాల వెంకటేశ్వరరావు అని ఆదిలీల ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఎస్.ఆదినారాయణ కొనియాడారు. ఆదిలీల ఫౌండేషన్, తెలుగు కళావాహిని, ఆలిండియా ఘంటసాల చైతన్య వేదిక ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం ఘంటసాల 102 జయంతి వేడుకలు, చల్లా సుబ్బారాయుడు రచించిన ఘంటసాల గాన సర్వస్వం గ్రంథావిష్కరణ, ఘంటసాల లఘు నాటం కార్యక్రమాలను నిర్వహించారు. డాక్టర్ ఆదినారాయణ మాట్లాడుతూ తెలుగు వారి గుండె చప్పుడు ఘంటసాల మాస్టారు అని అభివర్ణించారు. ఘంటసాల అభిమాన సంఘం ఛత్తీస్‌గఢ్ అధ్యక్షుడు తనికెళ్ల పార్థసారథి మాట్లాడుతూ ఘంటసాల పాటల సర్వస్వం రచయిత చల్లా సుబ్బారాయుడు కృషిని అభినందించారు. చైతన్యవేదిక అధ్యక్షుడు కోట వెంకటేశ్వరరెడ్డి, చింతకాయల చిట్టిబాబు భవిష్యత్ లక్ష్యాలను వివరించారు. సయ్యద్ రహంతుల్లా ఘంటసాల పాటల అష్టావధాన కార్యక్రమం నిర్వహించారు.

ముగిసిన ఇంటర్నేషనల్ కాయిన్ ఎక్స్‌పో



ప్రదర్శనను తిలకిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): శ్రీధర్ సీసీఈ సంస్థ ఆధ్వర్యంలో మూడు రోజులు నిర్వహించిన ఇంటర్నేషనల్ కాయిన్ ఎక్స్‌పో– 2024 ఆదివారం ముగిసింది. చివరి రోజు ఆదివారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ కుటుంబంతో వచ్చి ప్రదర్శనను తిలకించారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ కరెన్సీ నాణేలు, నోట్లలో ఆ దేశ చరిత్ర, సంస్కృతి ప్రతిబింబిస్తుందన్నారు. గుంటూరు మున్సిపల్ కమిషనర్ పులి శ్రీనివాసులు, సీఐడీ డీఎస్పీ కె.చక్రవరి ప్రసంగించారు. నిర్వాహకులు కలెక్టర్ లక్ష్మీశ, గుంటూరు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, సీఐడీ డీఎస్పీ చక్రవర్తిలను ఘనంగా సత్కరించారు. తానా పూర్వ అధ్యక్షుడు నిరంజన్ శృంగవరపు, తానా సభ్యులు జిల్లెలుమూడి వెంకట్, తానా మాజీ కార్యదర్శి కొల్లా అశోక్, నిర్వాహకులు కొమ్మూరి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకాలు చెల్లించండి

ఏపీ ఒలింపిక్ సంఘం కార్యదర్శి కేపీ రావు

విజయవాడస్పోర్ట్స్: క్రీడాకారులకు పెండింగ్‌లో ఉన్న నగదు ప్రోత్సాహకాలను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఏపీ ఒలింపిక్ సంఘం కార్యదర్శి కె.పి.రావు కోరారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు ఆయన ఆదివారం లేఖ రాశారు. కొత్త క్రీడా పాలసీ ప్రకారం ఒలింపిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించిన క్రీడాకారులకు రూ.7 కోట్లు ఇస్తామని ప్రభుత్వం చేసిన ప్రకటనపై హర్షం వ్యక్తం చేశారు. జాతీయ, అంతర్జాతీయ పతకాలు సాధించిన క్రీడాకారులకు ప్రభుత్వం ఇచ్చే నగదు ప్రోత్సాహకాలు రూ.12 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని వెంటనే మంజూరు చేసి క్రీడాకారులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

భక్తిభావం పెంపొందించాలి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ప్రతి మనిషి దైవ భక్తి, గురు భక్తి, దేశ భక్తి అనే మూడు రకాల భక్తి భావాలు పెంపొందించుకుంటే అది వ్యక్తి వికాసానికి, జన్మ సార్థకతకు దోహద పడతాయని ప్రముఖ సామాజిక ఆధ్యాత్మికవేత్త వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. సింగ్‌నగర్ ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శ్రీసత్యనారాయణ స్వామి సామూహిక వ్రతాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. సంఘ సభ్యులు పాల్గొన్నారు.

హరహర మహాదేవ..



ముత్యాలంపాడు ఆలయంలో అఖండ జ్యోతి



రామలింగేశ్వరస్వామి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామిదేవాలయంలో కార్తిక మాసోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి.
ఆలయ కమిటీ ఆధ్వర్యాన 15 కిలోల కర్పూరంతో స్వామి వారికి మహాకర్పూర హారతి ఇచ్చారు. 200 కిలోల ఆవు, నువ్వుల నూనెలతో అఖండ జ్యోతి వెలిగించి పూజలు చేసి హారతులు ఇచ్చారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉంచి ఊరేగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దీపారాధనలు చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు డీవీఎన్ రాజు, చిరంజీవి, ఐఎస్ఎన్ రాజు, బడేటి ధర్మారావు తదితరులు పర్యవేక్షించారు.





భవానీ ద్వీపంలో కార్తిక సందడి

కార్తికమాసంలో చివరి ఆదివారం సందర్భంగా భవానీద్వీపంలో వనభోజనాల సందడి కనిపించింది. కుటుంబ సభ్యులతో ద్వీపానికి వచ్చిన సందర్శకులు ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. ఆటలాడుతూ, ఉయ్యాలు ఊగుతూ, సెల్ఫీలు తీసుకుంటూ ఐల్యాండ్ అంతా తిరిగారు. సాయంత్రం వరకు ఉత్సాహంగా గడిపి ఇంటి ముఖం పట్టారు.
–సాక్షిఫొటోగ్రాఫర్, విజయవాడ

ట్రూఅప్, సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలి

సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): టీడీపీ కూటమి ప్రభుత్వం మరోసారి రూ. 9,412 కోట్ల విద్యుత్ భారాన్ని మోపనుందని, విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా పోరాడాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనేపూడి కాశీనాథ్ పిలుపునిచ్చారు. ఆదివారం గవర్నర్‌పేట బీసెంట్‌రోడ్డులోని మహంతి మార్కెట్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ట్రూఅప్ చార్జీలు, సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు నిలుపుదల చేయాలన్నారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం సెంట్రల్ సిటీ కార్యదర్శి భూపతి రమణారావు, నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె.దుర్గారావు, టి.ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.